ఆకట్టుకుంటున్న జలపాతం

ప్రజాశక్తి-అనంతగిరి: దట్టమైన అటవీ ప్రాంతంలో కనువిందులు చేస్తోంది బిసోరంగనీ జలపాతం. మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న కుండ పోత వర్షాల కారణంగా సుమారు 1500 అడుగు దూరం వాటర్ జారి పడుతుంది. రాజుపాక సమీపంలో ఉన్న ఈ జలపాతంలో కుటుంబం సమేతం స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా, ఆనందంగా గడుపుతున్నారు.



సుందరంగా ఉన్న జలపాతం

కాఫీ రైతుల శ్రమ టాటా కంపెనీకి ధారాదత్తం

- హోమ్ స్టేల ఏర్పాటు గిరిజన సంస్కృతికి విరుద్ధం
- ఒప్పందాలు వెంటనే రద్దు చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- పాడేరు: గిరిజన అభివృద్ధి పేరుతో ప్రయివేట్ కంపెనీలతో గిరిజన చట్టాలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు వెంటనే రద్దు చేయాలని సీపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస డిమాండ్ చేశారు. పాడేరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టూరిజం అభివృద్ధి పేరుతో ఏజెన్సీ గ్రామాల్లో హోం స్టేలు ఏర్పాటు కోసం ఓయో కంపెనీ తో, కాఫీ బ్రాండెడ్ కోసమని టాటా కంపెనీ తో ఒప్పందం చేసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. ఇటువంటి ఒప్పందాలూ సుప్రీం కోర్ట్ తీర్పుకు వ్యతిరేకమన్నారు. 1/70 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రవేట్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం చట్ట వ్యతిరేకం అన్నారు. గిరిజన ప్రాంతల్లో ఉన్న సహజ సంపదను కార్పొరేట్, ప్రవేటు కంపెనీలకు దోచిపెట్టడానికే ఏజెన్సీ ప్రాంతం అంటే చాలా ఇష్టమని గిరిజన ప్రాంతంలో ఉండడం అదృష్టం గా భావిస్తున్నానని ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున వంజంగి గ్రామాల్లో చేసిన. చంద్రబాబు నాయుడు ప్రకటన కు.. ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తి భిన్నంగా ఉందని అన్నారు. కాఫీ రైతుల శ్రమ దోచిపెట్టడానికే టాటా కంపెనీతో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. ఏజెన్సీ కాఫీకి ప్రపంచ ఖ్యాతి తెచ్చి ఆర్గానిక్ కాఫీగా గుర్తింపు తెచ్చారని, అంతర్జాతీయ మార్కెట్లో ఏజెన్సీ కాఫీ పేరు ప్రఖ్యాతులను టాటా కంపెనీకి అప్పగించి కాఫీ రైతుల శ్రమని దోచిపెట్టడం కోసం ఇటువంటి ఒప్పందలు చేసుకున్నారని అన్నారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను విషతుల్యం చేయడానికి టూరిజం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హోం స్టే ప్రమాదంగా మారుతుందనానద్ర. కనీసం గ్రామసభ అభిప్రాయాలకు కూడా విలువ ఇవ్వకుండా హోమ్ స్టేల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అత్యంత దారుణమైన చర్య అని పేర్కొన్నారు. ఇంకా మిగిలిన అగ్రిమెంట్లపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.





రాఖీలు కడుతున్న మహిళలు

వినూత్నంగా రాఖీ పండగ

ప్రజాశక్తి- హుకుంపేట : మండలం లోని గత్తుం పంచాయతీ దుర్గం గ్రామంలో రాఖీ పండగను వినూత్న రీతిలో ఆదివాసీలు ఆదివారం జరుపుకున్నారు. గ్రామ మధ్యలో 9 మంది అన్నదమ్ములు వరుసగా కూర్చుండగా, మహిళలు ఒక్కొక్కరికి రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం ఉత్సాహభరితంగా పండుగ వాతావరణంలో మునిగిపోయింది.

టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-జీ.కేవీధి: మండలంలోని వంచుల పంచాయితీ వంచుల చెరపల్లి గ్రామానికి చెందిన సడ్డ సత్తిబాబు ఇటీవల పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయనని జీ.కే వీధి మండలం టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు, క్లస్టర్ ఇన్చార్జి వడేల పాండురాజు చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో వెళ్లి చికిత్స పొందుతున్న సత్తిబాబును పరామర్శించారు. ఆయనకు మనో ధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పండ్లను ఇస్తున్న నేతలు

మొక్కలు ఇస్తున్న నాయకులు

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-జికెవీధి: మండలంలోని సంకాడ పంచాయతీ ఎర్నాపల్లి గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కల పంపిణీ కార్యక్రమాన్నీ ఎర్నాపల్లి గ్రామంలో చేపట్టారు. 49 కుటుంబాలకు ఒక్కో రైతుకి 700ల మొక్కల చొప్పున సిల్వర్, మహాగనిలను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులకు పంపిణీ చేశారు. రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం కంచె నిర్మాణానికి చర్యలు తీసుకునే విధంగా కూటమి నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దోంబూరు చిట్టిబాబు, ఊలం ఈశ్వర్, మామిడి నాగేంద్ర, దేషగిరి గోవిందరావు, దేశగిరి గంగరాజు, మోట్టడం రాజారావు, వైస్ ఎంపీపీ దేముడు, వీఆర్పీలు విష్ణుమూర్తి, లోత బాలరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనతో ఒరిగిందేమీ లేదు

- ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

ప్రజాశక్తి-పాడేరు : ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరు ఏజెన్సీకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనతో ఆదివాసీలకు ఒరిగిందేమీ లేదని, ఆయన పర్యటనతో కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెద్దేవా చేశారు. సీఎం పర్యటనపై ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మీకు ఆదివాసిలపైన శ్రద్ధ ఉంటే ఇప్పటికే జీవో 3కి బదులుగా మరో జీవో తెచ్చి ఉండేవారన్నారు., అధికారంలోకి సుమారు పదమూడు నెలలు పూర్తయిందని, ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఏమి చేయాలో ఆలోచన చేస్తున్నానని చెప్పడం చూస్తే ఆదివాసీలపై శ్రద్ధ లేదని స్పష్టం అవుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖలో సుమారు 3000 పోస్టులను మెగా డీఎస్సీలో కలిపి ఆదివాసీలకు అన్యాయం చేయలేదా ? అని ప్రశ్నించారు. ఆదివాసీలపై ప్రేమ ఉంటే డీఎస్సీలో ఆదివాసీలకు దక్కవలసిన పోస్టులను ఆదివాసీ లకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ ఇచ్చిన తర్వాత నియామకం చేపట్టవచ్చునని మరి ఎందుకు అలా చేయడం లేదో సమాధానం చెప్పాలని సీఎం ను ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్లో ఆనాడు ఆదివాసీలకు ఉద్యోగ నియామకాలు 100శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానం చేశారన్నారు. అది మీరు తెలుసుకుంటే మంచిదని చెప్పారు.పాడేరు ఐటీడీఏ కు 6 నెలలుగా పర్మినెంట్ పిఓ కూడా లేరని హెద్దేవా చేశారు.గిరిజన సంక్షేమ విద్యా శాఖకు డిప్యూటీ డైరెక్టర్ను గత 9 నెలలు నుంచి ఎవరిని నియమించకుండా ఇన్ఛార్జ్ తో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో పీసా కమిటీల తీర్మానాల కూడా లేకుండా కార్పొరేట్ కంపెనీలకు ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారని, ఇదేనా ఆదివాసీలపై మీకున్నటువంటి ప్రేమ అని సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు.



జిఒ 3కి ప్రత్యామ్నాయం కూటమికే సాధ్యం

- వైసిపి నేతల విమర్శలు సిగ్గుచేటు - జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జీవో నెంబర్ 3 రిజర్వేషన్ కు ప్రత్యామ్నాయం తీసుకొచ్చి ఆదివాసి యువతకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని అరకు టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు జిసిసి ఛైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ దినోత్సవం వేడుకలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకతో పండగ వాతావరణంతో జరిగిందని అన్నారు ఆదివాసీ దినోత్సవం వేడుకలు విజయవంతం చేసిన అధికారులకు ఆదివాసీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి ఐటిడిఏలు ఏర్పాటు చెయ్యడంతో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం 275 జిఓ తేవడం నారా చంద్రబాబు నాయుడు జి ఓ నెంబర్ – 3 తేవటం వల్ల వందలాది కుటుంబాలు ఆర్థిక అభివృద్ధితో పాటు ఉన్నత స్థానాలకు వెళ్లడానికి ఆదివాసులకు టిడిపి ప్రభుత్వం ఎంతో చేసిందని అన్నారు. గత 5 ఏళ్లలో జి ఓ నెంబర్ – 3 పై నోరు మెదపని వైసిపి నేడు ప్రత్యామ్నాయనికి తీవ్రంగా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సిగ్గు చేటన్నారు. వైసిపి కి ప్రజల మద్దతు పలికే పరిస్థితి లేదన్నారు. జీవో 3 స్థానంలో ప్రత్యామ్నాయం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని, వైసిపి మాయ మాటలకు ప్రజలు మోసపోయే పరిస్థితి లేదని, అరకు కాఫీ ప్రపంచ బ్రాండ్ కావాలని ప్యారిస్ లో కూడా అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. ఏజెన్సీలో కొత్తగా మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, దారేల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ శ్రావణ్‌కుమార్

చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయీ జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో చాపరాయి జలపాతం ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. సందర్శించిన పర్యాటకులు జలపాతం అందాలను తిలకించి ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా జలపాతం గార్డెన్ వద్ద ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. వర్షాకాలంలోనూ పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. పర్యాటకుల సందర్శనతో పర్యాటక ప్రాంతాలు సందడిగా కనిపిస్తున్నాయి.





రాకపోకల కష్టాలు మళ్లీ మొదటికి!

- నిర్మాణ పనుల్లో నాణ్యతలేమితో కుంగిన కాజ్‌వే
- నలభై గ్రామాలకు నిలిచిన వాహన రాకపోకలు
- బాధ్యులైన ఇంజినీర్లపై చర్యలు చేపట్టాలి
- ప్రధాన వంతెన నిర్మాణం వేగవంతం చేయాలి
- కాజ్‌వేను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో అన్నవరం వాగుపై కాజ్‌వే వద్ద ప్రజల రాకపోకల కష్టాలు మళ్లీమొదటికొచ్చాయి. నిర్మాణపనుల్లో అధికారుల నిర్లక్ష్యం, నాణ్యతాలోపం వల్లే రెండేళ్లయినా కాకుండానే కాజ్‌వే కుంగిపోయిందని సిపిఎం నేతల బృందం ఆక్షేపించింది. ప్రధాన వంతెన నిర్మాణంలో అలసత్వం, కాజ్‌వే నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులైన ఇంజినీర్లపై చర్యలు చేపట్టాలని, 40గ్రామాలకు వాహనరాకపోకలకు తీవ్ర ఆటంకమేర్పడిన నేపథ్యంలో ప్రత్నామ్యాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం అన్నవరం వాగుపై కుంగిపోయిన కాజ్‌వేను ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, పార్టీ నేతల బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, అన్నవరం వాగుపై నాలుగేళ్ల క్రితం ప్రధాన వంతెన కూలిపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లో పెద్దఎత్తున ఆందోళన, నిరాహారదీక్షలు చేపట్టడంతో అప్పటి అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి, నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.నాలుగు కోట్ల నిధులు మంజూరు చేయగా, నేటికీ వంతెన నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యం తీవ్రంగా కనబడుతోందన్నారు. ప్రధాన వంతెన నిర్మించకుండా, పక్కనే రెండు దఫాలుగా రూ. 70 లక్షలు ఖర్చు పెట్టి కాజ్‌వే నిర్మించారని, అధికారుల పర్యవేక్షణ లేమి, నిర్మాణంలో నాణ్యతాలోపంతో రెండేళ్లయినా నిలవకుండానే కుంగి పోయిందని, దీని మీదుగా వాహన రాకపోకలకు ఆస్కారం లేకుండా పోయిందని ఆరోపించారు.

శిథిలమైన పాత వంతెనను తొలగింపులో సరైన చర్యలు చేపట్టకపోవడం కూడా కాజ్‌వే కుంగిపోవడానికి కారణంగా కనిపిస్తోందని, దీనిపై సమగ్ర పరిశీలన జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

ప్రధాన వంతెన కూలిపోయిన తర్వాత మూడేళ్లపాటు ప్రత్యామ్నాయ వంతెనగానీ, కాజ్‌వే గానీ నిర్మించకపోవడంతో . అటువైపున ఉన్న దాదాపు 40 గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం దూరమై, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూనవరం వరకు బస్సులోవచ్చి, అక్కడి నుంచి కాలినడకన వెళ్లే వారన్నారు. వైద్యానికి రాజమండ్రి వెళ్లే వారు కూడా ఇలాంటి సమస్యలనే ఎదుర్కొన్నారన్నారు. కాజ్‌వే నిర్మాణం తర్వాత ఏడాదిన్నరగా ఆ కష్టాలు తొలగిపోయాయని ఆనందపడుతున్న పరిస్థితుల్లో ఇపుడు, అదికాస్తాకుంగిపోవడంతో మళ్లీ పాత కష్టాలే పునరావృతమయ్యే పరిస్థితి నెలకొందని సిపిఎం నేతలు ఆరోపించారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు అనారోగ్యంతో బాధపడు తున్నవారు ఇలా అందరినీ మళ్లీ ఇబ్బందులకు గురిచేసేందుకు కారణమైన కాజ్‌వే కుంగిపోవడానికి కారణాలపై విశ్లేషించి, చర్యలు చేపట్టడంతోపాటు తక్షణమే ప్రత్నామ్నాయ చర్యలు చేపట్టి 40 గ్రామాల ప్రజల రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. తక్షణమే బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టకపోతే సిపిఎం ఆధ్వర్యంలో మరో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సందర్శనలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, మండల నాయకులు పోడియం శ్రీరామమూర్తి, గుండిపుడి లక్ష్మణరావు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, సీరపు తాతబాబు, వీర్ల నాగేశ్వరరావు, రేఖపల్లి పీసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు సారా పాండురాజు తదితరులు పాల్గొన్నారు.



కూలిన కాజ్‌వే పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, ఇతర సిపిఎం నేతలు

పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు స్థల పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో నూతనంగా నెలకొల్పుతున్న పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు స్థలాన్ని ఎపి జెన్‌కో విజయవాడ విద్యుత్ సౌధ చీఫ్ ఇంజినీర్ (హైడల్) రవీంధర్‌రెడ్డి ఆదివారం పరిశీలన చేశారు. సీలేరులో విస్తృతంగా పర్యటించిన సిఇ, జొన్న మామిడి సమీపంలో డంపింగ్ యార్డ్ అటవీ శాఖ టింబర్ డిపో వెనుక పార్వతీనగర్‌లో నూతనంగా నిర్మించనున్న ప్రాజెక్టు స్థలాన్ని మ్యాపుల సాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎపి జెన్‌కో ఆధీనంలో ఎన్ని హెక్టార్లు భూమి ఉందో ఆరా తీసి హద్దులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు వివరాలను ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ రాజారావు, ఎపి జెన్‌కో స్టోరేజ్ ప్రాజెక్టు ఎడిఇ అప్పలనాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు అటవీ అనుమతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు నిర్మాణం సమయంలో మట్టిని డంప్ చేయడానికి ఎన్ని హెక్టార్లు భూమి అవసరం, ఎపి జెన్‌కో పరిధిలో ఎన్ని హెకార్లు భూమి ఖాళీగా ఉందో ఆరా తీశారు. పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు భూమి హద్దులను పరిశీలించారు. డంపింగ్ యార్డుకు ఎన్ని హెక్టార్లు రిజర్వుఫారెస్ట్ లో తీసుకుంటున్నారు, ఇంకా ఎంత భూమి డంపింగ్‌కు అవసరం ఉంటుందనే అంశాలను కింద స్థాయి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ విద్యుత్ సౌధ ఇఇ (సివిల్) రత్నకుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న సిఇ రవీంధ్రరెడ్డి

దేవీపట్నం సచివాలయ ఉద్యోగి కిడ్నాప్ కేసులో / ఐదుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -రంపచోడవరం: దేవీపట్నం మండలం శరభవరం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సోయం శ్రీసౌమ్య కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులను మూడు రోజుల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్‌పి సాయి ప్రశాంత్ తెలిపారు .ఆదివారం రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ నెల 7న దేవీపట్నం మండలం శరభవరం సచివాలయ ఉద్యోగి సోయం శ్రీశైలంను కిడ్నాప్ చేసిన నిందితులను వై.రామవరం మండలం పాతకోట గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కిడ్నాప్ జరిగిన నాటి నుండి పట్టుకునే వరకు నిందితుల కదలికలను గుర్తించామని తెలిపారు. ఐదుగురు నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. కిడ్నాప్‌కు సహకరించిన మరో ఇద్దరిని కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న అయిదుగురిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగు తున్నాయని డిఎస్‌పి వివరించారు. ఈ కేసు ఛేదనలో పాల్గొన్న ఐదు ప్రత్యేక బృందాలకు చెందిన సిఐలు, ఎస్సైల పనితీరును అభినందించారు. ఈ సమావేశంలో రంపచోడవరం సిఐ ఎన్. సన్యాసినాయుడు, అడ్డతీగల సిఐ, మారేడుమిల్లి సిఐ, గుర్తేడు, గంగవరం, దేవీపట్నం ఎస్ఐలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రంపచోడవరం డిఎస్‌పి సాయిప్రశాంత్

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో

ఖరీఫ్ సాగుపై నీలినీడలు!

- ప్రతికూల వర్షాలతో సాగని వరినాట్లు
- నారుకు జీవమే తప్ప, సాగునీరు లేని వైనం
- తల్లడిల్లుతున్న అన్నదాతలు..ఆకాశానికేసి చూపు

ప్రజాశక్తి-కూనవరం: తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన వరిపంట సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటి వరకు కనీస వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆకాశానికేసి చూస్తున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నారుమళ్లకు జీవమే తప్ప, పొలాల్లో సాగునీరు లేని పరిస్థితి నెలకొంది. దీంతో దుక్కులు కూడా చేయడానికి వీలులేని పరిస్థితుల్లో పొలాలన్నీ బీడులను తలపిస్తున్నాయి ఎకరాకు 20 నుండి 30 బస్తాలు పండే పంటపొలాల్లో ఇప్పటివరకు నీరు చేరక, దమ్ములు, నాట్లు వేయలేని పరిస్థితుల్లో రైతులు ఒకింత ఆందోళనకు గురయ్యే పరిస్థితి ఉంది. వాతావరణ మార్పులతో తుఫాను హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, చెదురుమదురు వర్షాలే తప్ప, వ్యవసాయానికి సానుకూలమైన నీరు లేని పరిస్థితి ఉంది. ఇప్పటివరకు ముఖం చాటేసిన వర్షాలు తక్షణం కురిస్తే సరేసరి, లేకుంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అన్నదాతలకు నిరాశను మిగిల్చేదిగాఉందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.



వర్షాభావ పరిస్థితులతో దమ్ములకు నోచుకోక బీడులుగా దర్శనమిస్తున్న పంటపొలాలు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



అనంతగిరిలో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి -యంత్రాంగం

అనంతగిరి: యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి విశాఖ జిల్లా పూర్వ సహ అధ్యక్షులు శెట్టి రాంబాబు అధ్యక్షతన మండలంలోని శివలింగపురం మండల పరిషత్ పాఠశాల వద్ద ఆదివారం పతాకం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అల్లూరి జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పుడిగి .దేముడు, రాంబాబులు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయం అని పునరుద్ఘాటించారు.ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో, భారతీయ విద్య కూడా పురోభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ కార్యదర్శి సరజీ. మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు సోమెల . గంగరాజు, యుటిఎఫ్ మహిళా నాయకురాలు కెవివి ఉషారాణి, జిల్లా కౌన్సిలర్ యుటిఎఫ్ నాయకులు పుడిగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండల అధ్యక్షుడు సమర్థి రాజు, సీనియర్ నాయకులు, పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్దేశ్వరరావు చేతుల మీదుగా పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయక కిముడు.సూర్యనారాయణ, పుండరీ, త్రినాథం, గోవింద్, రఘుమణి, శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ పాటుపడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ధర్మారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అసోసియేట్ అధ్యక్షులు చిట్టపులి త్రినాథం, ప్రధాన కార్యదర్శి సీసా గోపి, కార్యవర్గ సభ్యులు అరిసెల. గణపతి, ఏ.వీరన్న, ధనపతి, యమ్.గణేష్ కుమార్, పి.లింగన్న తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో....

గంగవరం : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు 51ఏళ్లుగా యుటిఎఫ్ అవిశ్రాంత పోరాటం, కృషి చేసిందని యూనియన్ మండల అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు దొర అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంఆర్సి సమీపంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల శాఖ సహాధ్యక్షులు కారం బొజ్జిదొర ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఎల్. రుక్మిణి దేవి, జిల్లా కౌన్సిలర్ సిహెచ్.రామకృష్ణారెడ్డి, సభ్యులు ఎ రాంబాబు, సిహెచ్.సత్యనారాయణ దొర, ఆర్. వెంకటేశ్వరరావు రెడ్డి పాల్గొన్నారు



అడ్డతీగలలో...

అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా యూనియన్ జెండాను పి.అప్పారావు, ఎస్.నాగన్న దొర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సభ్యులందరూ అధ్యయనం, అధ్యాపనం సామాజిక స్పృహకు కట్టుబడి హక్కుల నిరంతర సాధనకు, విద్యారంగం పరిరక్షణకు పోరాటం కొనసాగించాలని విలువచ్చారు. కార్యక్రమంలో రామప్పలు, జగదీష్, చిన్నారావు, గాంధీ రెడ్డి, అప్పారావు, నాగన్న దొర, పోలయ్య, వెంకటేశ్వరరావు, రమణమ్మ, గంగాభవాని, మల్లేశ్వరి, శ్రీనివాస్, తమన్న దొర పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కూనవరం: యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులబోరులో యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. యూనియన్ జెండాను యుటిఎఫ్. మహిళా సబ్ కమిటీ కన్వీనర్ కట్టం. కుమారి ఆవిష్కరించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన యూనియన్ ఆడిట్ జిల్లాకమిటీ సభ్యులు యు. వెంకటనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్సి నిర్వహించాలని కోరారు.ఇటీవల ఆరకు సభలో జిఒ3ను మేమే తెచ్చామని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ జిఒ పునరుద్దరణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, ఇతర ప్రయోజనాల సాధనకు యుటిఎఫ్ పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందన్నారు.



కూనవరం మండలం టేకులబోరులో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నేరాలు ఘోరాలు

సముద్రంలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్, లైట్ హౌస్ వెనుక సముద్రంలో మునిగి ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తగరపువలస సంతపేటకు చెందిన నరగాడ అప్పలరెడ్డి (45) తన కుటుంబంతో కలిసి జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో నివసిస్తున్నారు. అప్పలరెడ్డి అతని కుమారుడు మోజెస్, కుటుంబ సభ్యులు జగన్నాథం కలిసి బీచ్కు వచ్చారు. అప్పలరెడ్డి, అతని కుమారుడు మోజెస్ లైట్ హౌస్ వెనుక సముద్రంలో స్నానానికి దిగారు. అలల తాకిడికి అప్పలరెడ్డి సముద్రంలో కొట్టుకు పోతుండగా అతని కుమారుడు మోజెస్ కేకలు వేశాడు. అక్కడే ఉన్న బీచ్ పోలీ(గార్డు) వెంటనే సముద్రంలో దిగి అప్పలరెడ్డిని ఒడ్డుకు చేర్చారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య అరుణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు ఎలక్ట్రీషియన్గా పనిచేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - చీడికాడ:విద్యుత్ షాక్తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని జైతవరంలో చోటుచేసుకుంది. జైతవరం గ్రామానికి చెందిన లాలం లక్ష్మణమ్మ(35) సింగవరం గ్రామం సమీప తమ కల్లాల వద్ద ఆదివారం మధ్యాహ్నం పశువులకు గడ్డి కోస్తుంది. వ్యవసాయ మోటార్ కు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ వైర్ తెగి ఆమెపై పడడంతో షాక్ కు గురై ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈ సంఘటనపై చీడికాడ పోలీసులకు ఫిర్యాదు అందటంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో వేమగిరి గ్రామం శివారు కొండ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఆదివారం ఉదయం సుమారు 11 గంటలకు కోడిపందేల శిబిరంపై దాడిచేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. 730 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని జమాదులపాలేనికి చెందిన వివాహత మొల్లి శ్యామల (25) గడ్డి మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుందిన ఈ మేరకు మృతురాలి అన్న గొర్లి అప్పలరాజు కశింకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసాడు వివరాలివి. జమాదులుపాలెం గ్రామానికి చెందిన మొల్లి సూర్య అప్పారావుతో 2018లో శ్యామలకు వివాహమైంది. గ్రామంలో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న శ్యామల ఈనెల 9న ఆదివారం పాకల వద్దకు రోజులాగే వ్యవసాయ పనులకు వెళ్ళింది. గ్రామానికి చెందిన వియ్యపు ఈశ్వరరావు, వియ్యపు రాజేశ్వరిలతో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొడవ పడిన నేపథ్యంలో మనస్తాపంతోగడ్డి మందు తాగింది. మృతురాలి మామయ్య మొల్లి తాతారావు అందించిన సమాచారం మేరకు అప్పలరాజు అస్వస్థతకు గురైన శ్యామలను ఎన్టిఆర్ ఆసుపత్రిలో చేర్పించగా, ప్రధమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్కు రిఫర్ చేశారు. అయితే పట్టణంలోని ఉషా ప్రైమ్ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా ఆరోగ్యం విషమించి మృత్యువాత పడింది. అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతురాలికి ఇద్దరు మగపిల్లలున్నారు. సిఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పి మనోజ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25న కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపిఆర్పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె.హుస్సేన్ తెలిపారు. మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో ఎపిఆర్పిఎ సమావేశం ఆదివారం నిర్వహించారు. సిహెచ్.తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్కె.హుస్సేన్ మాట్లాడుతూ, జులై 9వ తేదీన దేశ వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న సభ్యులందరికీ, సెంట్రల్ పెన్షనర్లు నిర్వహించిన మానవహారంలో పాల్గొని జయప్రదం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబర్ 13వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 22, 23వ తేదీల్లో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటిలో సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెన్షనర్ల సంఘం మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పబ్లిక్ స్కూల్లో క్లాస్ కెప్టెన్ల ఎన్నిక



ఎన్నికైన కెప్టెన్లు

ప్రజాశక్తి- అరకులోయ:అరకులోయ అల్లూరి సీతారామరాజు (సిబిఎస్ఇ) పబ్లిక్ స్కూల్లో 2025-2026 అకాడమిక్ సంవత్సరం కి సంబందించి ఇటీవల నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీలో భాగంగా డెమొక్రటిక్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి క్లాస్ కెప్టెన్లు ఎన్నుకున్నట్లు పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జీవి నరసయ్య తెలిపారు. స్కూల్ కెప్టెన్ గా ఎల్.బి. లిఫిన్ ఎన్నికవ్వగా, వైస్ కెప్టెన్ గా ఎస్ .కావ్య శ్రీ, హెడ్ బాయ్ గా బి. స్టీఫెన్, హెడ్ గర్ల్ గా వి.వైశాలి ఎన్నికయ్యారు.ఎల్ కె జి నుండి 12వ తరగతి వరకు క్లాస్ కెప్టెన్లు ,వైస్ కెప్టెన్లు ఎన్నిక జరిగిందని అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ ఎకాడమీ డీన్ (డైరెక్టర్) నరసయ్య తెలిపారు.

సామరస్యంతోనే ప్రపంచ శాంతి

ప్రజాశక్తి- సీతమ్మధార : సామరస్యంతోనే ప్రపంచ శాంతి నెలకొంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. హీరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఎఆర్ఎఫ్) ఆధ్వర్యాన ఎల్బి.కాలేజీలోని గాంధీ సెంటర్లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఐఎఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో తొలుత సర్వమత ప్రార్థనలు చేశారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ప్రపంచ శాంతి కోసం యుఎన్ఒ ద్వారా ఐఎఆర్ఎఫ్ కృషిచేస్తుందని తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్దాస్, ఆచార్య కె.రవి, ఎఐఆర్ పూర్వ స్టేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, బ్రహ్మకుమారి రామేశ్వరి తదితరులు మాట్లాడారు.



సీలేరులో కురుస్తున్న భారీ వర్షం

సీలేరులో కుండపోత వర్షం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రహదారులు డ్రైనేజీలు వర్షపు నీటితో పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు నానా అవస్థలు గురయ్యారు. వర్షం కారణంగా ఆదివారం వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంట పాటు అతి భారీ వర్షం కురవడంతో వారపు సంతలో చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక మార్కెట్లో వ్యాపారాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం మూడు గంటలకు వర్షం తగ్గుముఖం పట్టడంతో దుకాణాలు తెరవగా, సంతకు వచ్చే వినియోగదారులు ఆదరాబాదరగా సరుకులు కొనుగోలు చేసి ఇంటిదారి పట్టారు. వారపు సంతకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు ఇంటికి తరలి వెళ్లారు.

తొట్లకొండను పరిరక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రాచీన బౌద్ధారామాలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ సర్వే నెంబర్ 314లోని ప్రాచీన బౌద్ధ తొట్లకొండను ప్రభుత్వం కాపాడాలన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్కో ఉత్తర్వులను ధిక్కరించి తొట్లకొండపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ అక్రమ భూదందా చేసిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నమంగవారి పేట, పెద్దమంగవారి పేట తదితర ప్రాంతాల్లో భూకబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. చిన్న జీయర్ స్వామి ఆశ్రమం నుంచి, ఆ పక్కనే యాదాద్రి నుంచి 314 సర్వే నెంబరు తొట్లకొండ కంచెను దాటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భీమ్సేన్ వార్ ప్రతినిధులు డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, గుడివాడ అప్పారావు, ఎస్.సత్యారావు, సూర్యనారాయణ, రాంప్రభు, భీమయ్య, మల్లయ్య రాజు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆధ్వర్యంలో క్యాంపు ఇన్ఛార్జి స్వామి లోకమయనంద జీ మహారాజ్, స్వామి మృడాత్మనంద మహారాజ్ పర్యవేక్షణలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ తలారి సుబ్బరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ పోతుల రామారావు పాల్గొని మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

వీరిలో 66 మందికి రక్తపరీక్షలు, ఎనిమిది మందికి ఇసిజి, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, 15మందికి ఫిజియోథెరపీ, చేసినట్లు స్వామీజీ తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి, 59మందికి కంటి పరీక్షలు చేశారు. 19మందికి కళ్లజోళ్లు అందించారు. దృష్టిలోపం ఉన్న తొమ్మిది మందిని కంటి ఆపరేషన్లుకు ఎంపికచేసి, వేమగిరి నేత్రాలయానికి తరలించారు. వైద్య శిబిరంలో డాక్టర్ పోతుల రామారావు గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం తదితర దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ తెలిపారు. వైద్య శిబిరంలో క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజన సదుపాయంకల్పించారు.

విజయవాడ సన్ షైనర్స్ విజయఢంకా

కాకినాడ కింగ్స్పై 24 పరుగుల తేడాతో గెలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిఎల్ 2025 సీజన్ - 4లో విజయవాడ సన్ షైనర్స్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం మధ్యాహ్నం విశాఖలోని ఎసిఎ - విడిసిఎ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్లో ఆ జట్టు కాకినాడ కింగ్స్పై 24 పరుగుల తేడాతో విజయం సాధించి ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేయగా 196 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన కాకినాడ కింగ్స్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలవుట్ అయింది.

విజయవాడ సన్ షైనర్స్ జట్టు బ్యాటర్లలో జహీర్ అబ్బాస్ 19 బంతుల్లో 4 సిక్సులు, 7 ఫోర్లతో 57 పరుగులు సాధించి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అదేవిధంగా మరో బ్యాటర్ గరిమెళ్ళ సాయి పూర్ణ తేజ 38 బంతులలో 2 సిక్సులు, 3 ఫోర్లతో 46 పరుగులు సాధించి అతనికి అండగా నిలిచాడు. వీరి ఇరువురితోపాటు ఎం.అభినవ్ 26, ధీరజ్ కుమార్ 23, ఎం.వంశీకృష్ణ 19 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. కాకినాడ కింగ్స్ బౌలింగ్ విభాగంలో ఎం.ఆంజనేయులు 3 వికెట్లు, కె.సుదర్శన్ 2 వికెట్లు తీశారు.

అనంతరం బ్యాటింగ్కు దిగిన కాకినాడ కింగ్స్ జట్టులో పి.అర్జున్ టెండూల్కర్ 27 బంతులలో 4 సిక్సులు, 3 ఫోర్లతో 48 పరుగులు, కెప్టెన్ శ్రీకర్ భరత్ 21 బంతుల్లో 3 సిక్సులు, 2 ఫోర్లతో 34 పరుగులు, ఎం.రవి కిరణ్ 12 బంతులలో 3 సిక్సులు, 2 ఫోర్లతో 31 పరుగులు చేశారు. వారు మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ ఆశించిన మేర రాణించకపోవడంతో కాకినాడ కింగ్స్ జట్టు ఓటమిపాలైంది.

అదేవిధంగా బౌలింగ్ విభాగంలో విజయవాడ సన్ షైనర్స్ జట్టు బౌలర్లు వై.ప్రత్వీరాజ్, తన్నేరు భరత్ చెరో 3 వికెట్లు తీయగా, కెఎస్ఎన్.రాజు రెండు వికెట్లు, ఎ.లలిత్ మోహన్, గొల్లపూడి సాయి వెంకట సుమిత్ చెరో ఒక వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్లో మెరుపు వేగంతో అర్ధ సెంచరీ సాధించిన జహీర్ అబ్బాస్కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



అర్ధ సెంచరీతో రాణించిన జహీర్ అబ్బాస్

వైసిపి అభ్యర్థులకు ఓటు వేసిన

కార్పొరేటర్లను బెదిరించడం దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసిపి అభ్యర్థులకు ఓటు వేసిన కార్పొరేటర్లను కూటమి ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్లో ఓటు వేసిన వారి వివరాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరికి ఎవరు ఓటు వేశారో కూటమి నాయకులకు ఎలా తెలిసిందని అడిగారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూడా ఇలాగే గెలిచారేమో అని అనుమానం కలుగుతోందన్నారు. ఎవరు ఎవరికి ఓటు వేశారో చూసి వారిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకూ సమంజసమన్నారు. దీనికి ఎన్నికల అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పులివెందులలో జరుగుతున్న తాజా ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ బూతులు ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఎన్నికల అధికారులు పచ్చ చొక్కాలు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి రాజ్యాంగం నడుస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పార్టీ మారిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వెయ్యాలని కోరామని, ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించారని ఆయన అన్నారు. 32 మంది బలం తమకు ఉంటే స్టాండింగ్ కమిటీ ఎన్నికలో 50 ఓట్లతో విజయం సాధించామని చెప్పారు. 18 మందికిపైగా కూటమి కార్పొరేటర్లు తమకు ఓటేశారని తెలిపారు. దీన్ని బట్టి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంతవరకు ఉందో స్పష్టమవుతోందన్నారు. మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు



మాట్లాడుతున్న పులి సంతోష్ కుమార్

కోయ్తోర్ పండూం దక్కట్ విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-కూనవరం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కూనవరంలో కోయత్తోర్ పండూం దక్కట్ తోర్ కార్యక్రమాన్ని విజయవంతంపై ఆదివాసి గిరిజన సంఘం హర్షం వ్యక్తంచేసింది. సహకరించిన అధికారులు, ప్రజనీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం బాబు బొర్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, ఆదివాసీ ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించిన, సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ రంపచోడవరం జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, బొగ్గ రామారావు, సోడే శంకర్, మడెం బాబూరావు, బొగ్గ సుబ్బయ్య, ధర్మల అమ్మాజీ, పాయం సత్యనారాయణ, కారం జయసుధ పాల్గొన్నారు.

నేడు విశాఖ డెయిరీ కార్మికుల 24 గంటల దీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ డెయిరీలో అన్యాయంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరాహార దీక్ష జరుగనుంది. ఈ దీక్షలో విశాఖ డెయిరీ ఉద్యోగులు, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్, విశాఖ డెయిరీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డెయిరీ యాజమాన్యం 20 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికులను అకారణంగా, ఏ విధమైన ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా జూన్ 10 నుంచి విధుల నుంచి నిలుపుదల చేసిందని, ఆ రోజు నుండి నేటి వరకు ఎన్ని సార్లు యాజమాన్యాన్ని కలిసినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యారన్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద జరిగిన సమావేశంలో కాంట్రాక్టర్ అందరినీ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా, యాజమాన్యం తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. 20 సంవత్సరాల నుంచి ఏ విధమైన కార్మిక హక్కులూ లేకపోయినా కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకపోయినా, బానిసల మాదిరి డెయిరీ కార్మికులు వెట్టి చాకిరీ చేశారన్నారు. యూనియన్ పెట్టుకుని హక్కులు అడిగితే ఇచ్చినట్టే ఇచ్చి, 305 మంది కార్మికులను పనికి రాకుండా ఆపేశారన్నారు. వారి స్థానంలో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటున్నారని తెలిపారు. ప్లాంట్ లోపల పాలు, పెరుగు పాడైపోతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ ఉద్యోగాల కోసం గేట్ వద్దకు వస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తున్నారన్నారు. కార్మికులు నిరసన తెలిపేందుకు గాజువాక, బిహెచ్ఇఎల్, అక్కిరెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో అనుమతి కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 24 గంటలపాటు నిరాహార దీక్ష చేస్తున్నామన్నారు. ఈ దీక్షలకు సంఘీభావంగా విశాఖ జిల్లాలోని సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మద్దతుగా మాట్లాడతారన్నారు.

'వనం మనం'లో మొక్కల నాటివేత

ప్రజాశక్తి- అడ్డతీగల : వనం మనం కార్యక్రమంలో భాగంగా జాతీయరహదారికి 516కు ఇరువైపులా మొక్కలు నాటారు. ఎన్హెచ్ఆర్పిఎఫ్, అడ్డతీగల, వై రామవరం మండల సభ్యులందరూ పాల్గొని వనం మనం కార్యక్రమంలో 170 మొక్కలను నాటినట్లు సంస్థ రంపచోడవరం నియోజకవర్గ ఇన్ఛార్జి ఏ. రాంప్రసాద్, మహిళా విభాగం ఇన్చార్జి ఎ.శ్రీదేవి ముంగారి తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను చేపట్టనున్నట్లు వెల్లడించారు.